# సాక్షి అనంతపురం


శనివారం । 28 । డిసెంబర్ । 2024






## చీనీ టన్ను రూ.12,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.12,500 పలికాయి.



## కిలో టమాట రూ.17

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.17, కనిష్టంగా రూ.10, సరాసరిన రూ.13 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

28.7°/ 17.3°

జిల్లాలో శుక్రవారం తుపాను వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.



అనంతపురంలో కరెంటు చార్జీలను నిరసిస్తూ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ర్యాలీ.



రాప్తాడులో విద్యుత్ కార్యాలయం వద్ద తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన



కళ్యాణదుర్గంలో సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో 'పోరుబాట'



గుంతకల్లులో ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆందోళన, చిత్రంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తదితరులు



అనంతపురంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈకి వినతిపత్రం అందజేస్తున్న అనంత, గిరిజమ్మ తదితరులు

# నిరసనాగ్రహం

- విద్యుత్ 'పోరుబాట' విజయవంతం
- కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు
- చంద్రబాబు మారకపోతే ప్రజలే బుద్ధి చెప్తారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం కార్పొరేషన్:** కరెంటు చార్జీలు పెంచి ప్రజలకు షాకిచ్చిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం చేపట్టిన 'పోరుబాట' జిల్లాలో విజయవంతమైంది. అనంతపురంతో పాటు తాడిపత్రి, శింగనమల, ఉరవకొండ, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, రాప్తాడు నియోజకవర్గ కేంద్రాల్లో జరిగిన నిరసన ర్యాలీల్లో వేలాది మంది పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు కదం తొక్కారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు, రాష్ట్ర నాయకులు తదితరులు ఎక్కడికక్కడ విద్యుత్ అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. అనంతపురంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నేతృత్వంలో నిరసన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు కరెంటు చార్జీలు పైసా పెంచబోమని చెప్పి గడిచిన ఆరు నెలల్లో ఏకంగా రూ.15,485 కోట్ల మేర చార్జీలను పెంచి ప్రజలపై అదనపు భారం మోపారని ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ హామీల్లో పింఛన్ మినహా మిగిలిన పథకాలను అటకెక్కించి ప్రజలను దగా చేస్తున్నారన్నారు. అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు మూడుసార్లు పీహెచ్‌డీ తీసుకున్నారని ఎద్దేవా చేశారు. నాలుగోసారి పీహెచ్‌డీ తీసుకోలేరని, చంద్రబాబు మారకపోతే ప్రజలు రాజకీయ సమాధి చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం ఆయన విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, టాస్క్‌ఫోర్స్ ప్రతినిధి రమేష్‌గౌడ్, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

▸ గుంతకల్లులోకరెంటు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన విద్యుత్ పోరుబాటలో మొదటగా చేపట్టిన భారీ బైక్ ర్యాలీని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రారంభించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఏడీఈ నాగేంద్రకు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్, తదితర హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారన్నారు. రూ.15వేల కోట్లకుపైగా ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని తిప్పికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, తదితరులు పాల్గొన్నారు.

▸ రాప్తాడులో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ పోరుబాటకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైఎస్సార్ విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్లి విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలపై భారం పడకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేశారని, దేశంలో ఎక్కడా లేని విధంగా సెకీతో తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసి రాష్ట్రానికి రూ.2 లక్షల కోట్ల ఆదాయాన్ని సమకూర్చారని కొనియాడారు. కార్యక్రమంలో సీకే పల్లి ఎంపీపీ అంజలి, ఆత్మకూరు ఎంపీపీ హేమలత, అనంతపురం రూరల్ ఎంపీపీ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

▸ ఉరవకొండలో నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఉరగాద్రి కల్యాణ మంటపం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. అనంతరం విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారన్నారు. ఆరు నెలల వ్యవధిలోనే ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు దేవీ బాయి, నరసింహులు, నారాయణరెడ్డి, నాయకులు సీపీ వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

▸ కళ్యాణదుర్గంలో సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి డీఈఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రంగయ్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఒకలా హామీలు గుప్పించడం, అధికారంలోకి రాగానే మరోలా వ్యవహరించడం చంద్రబాబుకు పరిపాటిగా మారిపోయిందన్నారు. రూ.వేల కోట్లు ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, ముఖ్యనేత ఉమామహేశ్వర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

▸ శింగనమలలో సమన్వయకర్త వీరాంజనేయులు, ప్రభుత్వ మాజీ విద్యా సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ధరలు పెంచబోమంటూనే ప్రజలపై రూ.వేల కోట్ల భారం మోపుతోందన్నారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్, ఎంపీపీలు యోగేశ్వరి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

▸ తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలపై పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్లి రైల్వే ఫీడర్ రోడ్డులో ఉన్న ట్రాన్స్ కో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ధరలను పెంచి ప్రజల జీవన ప్రమాణాలను ప్రభుత్వం తగ్గిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

▸ రాయదుర్గంలో వినాయక సర్కిల్ నుంచి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ర్యాలీ ప్రారంభించారు. కణేకల్లు రోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ ఆరు నెలల్లోనే రూ.వేల కోట్ల అదనపు భారం ప్రజలపై మోపడం సరికాదన్నారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పొదరాళ్ల శిల్ప, రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, నాయకులు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉరవకొండలో విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ



రాయదుర్గంలో మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో పోరుబాటకు బయల్దేరిన కార్యకర్తలు



శింగనమలలో వీరాంజనేయులు, ఆలూరి సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ

## ఎస్సీ కులగణనపై సామాజిక తనిఖీ

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

**అనంతపురం అర్బన్:** ఎస్సీ వర్గీకరణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ జనాభా వివరాలపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం వద్ద ఉన్న ఎస్సీ కులగణన వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తామన్నారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే జిల్లాలోని ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారు ఈ నెల 31వ తేదీలోగా సచివాలయాల్లో సమర్పించాలన్నారు. వచ్చిన అభ్యంతరాలను జనవరి ఆరో తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10వ తేదీన కులగణన తుది వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తామని వెల్లడించారు.

**మూడు దశల్లో తనిఖీ**

సామాజిక తనిఖీకి సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. అభ్యంతరాలను మూడు దశల్లో తనిఖీ చేస్తామని పేర్కొన్నారు. అభ్యంతరాలను తొలుత వీఆర్‌ఓ పరిశీలించి ఆర్‌ఐకు నివేదిక ఇస్తారన్నారు. దానిని ఆర్‌ఐ పునఃశీలించి తహసీల్దారుకు నివేదిస్తారని తెలిపారు. ముగ్గురి నివేదికలను పరిశీలించి తుది ఆమోదం తరువాత పోర్టల్‌లో పొందుపరుస్తారని తెలియజేశారు.

**వివరాలపై ర్యాండమ్ తనిఖీ**

పోర్టల్‌లో పొందుపరిచిన వివరాల్లో కచ్చితత్వం కోసం ర్యాండమ్ తనిఖీ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని సహాయ సాంఘిక సంక్షేమ అధికారులతో 50 మంది వివరాలను ర్యాండమ్‌గా తనిఖీ చేస్తామని వెల్లడించారు. ఎస్సీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# నీరా'జనం'.. జగన్నినాదం

'జై జగన్' నినాదం మిన్నంటింది. జాతీయ రహదారిపై అభిమాన సంద్రం పోటెత్తింది. చిన్నా, పెద్దా తేడా లేకుండా జనమంతా అభిమాన నేత రాక కోసం ఎదురుచూశారు. కళ్లారా చూసుకుని ఉప్పొంగి పోయారు. పులివెందుల పర్యటన ముగించుకుని రోడ్డు మార్గాన జిల్లా మీదుగా బెంగళూరు బయలుదేరిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అడుగడుగునా అభిమానులు బ్రహ్మరథం పట్టారు.



రాప్తాడులో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



రాప్తాడులో వైఎస్ జగన్‌తో కరచాలనం చేసేందుకు ఎగబడుతున్న అభిమానులు

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం
- జాతీయ రహదారిపైకి చేరిన గ్రామీణులు
- జననేతతో కరచాలనం, సెల్ఫీకోసం ఎగబడిన జనం

**సాక్షి బృందం:** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుక్రవారం జిల్లాలో అపూర్వ స్వాగతం దక్కింది. ముదిగుబ్బ, బత్తలపల్లి, రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, పెనుకొండ, సోమందేపల్లి, పాలసముద్రం క్రాస్, చిలమత్తూరులో అభిమానులు బాణసంచా పేలుస్తూ ఘన స్వాగతం పలికారు.

**జాతీయ రహదారిపై అభిమాన సంద్రం**

ముదిగుబ్బలోని కాకతీయ ధాబా వద్ద, బత్తలపల్లిలోని టోల్‌ప్లాజా వద్ద జగన్‌ను చూసేందుకు అభిమానులు పోటెత్తారు. జై జగన్ నినాదాలు చేశారు. వైఎస్ జగన్ వారికి అభివాదం చేశారు.

**అభిమాన హోరు**

రాప్తాడులోని నాలుగు రోడ్ల కూడలికి జగన్ కాన్వాయ్ చేరుకోగానే మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్‌తో పాటు వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 'జై జగన్...జైజై జగన్ అంటూ అభిమానులు నినాదాలతో హోరెత్తించారు. జననేతతో మాట్లాడటానికి, కరచాలనం చేయడానికి పోటీపడ్డారు. చెన్నేకొత్తపల్లిలోని వై జంక్షన్ వద్ద, గోరంట్ల మండలం పాలసముద్రం క్రాస్‌లోనూ భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు జగన్‌కు ఘన స్వాగతం పలికారు.

**స్వాగతం పలికిన ఉషశ్రీచరణ్**

సోమందేపల్లి వై జంక్షన్ వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పార్టీ నేత పొగాకు రామచంద్ర తమ అభిమాన నేతకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఇక బాగేపల్లి టోల్‌ప్లాజా వద్ద కూడా జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభించింది. సమన్వయకర్త టీఎస్ దీపిక, వేణురెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఆయనతో కరచాలనం, సెల్ఫీ కోసం పోటీపడ్డారు. వారందరికీ అభివాదం చేస్తూ జగన్ ముందుకు సాగారు.



బత్తలపల్లి టోల్‌ప్లాజా వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం జగన్

## కట్నం వేధింపుల కేసులో భర్తకు జైలు శిక్ష

**అనంతపురం:** కట్నం వేధింపుల కేసులో భర్తకు ఏడాది జైలు శిక్ష పడింది. వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని ఐదో రోడ్డుకు చెందిన ఎస్.ముస్రత్ జాన్‌ను ఇస్మాయిల్ బాషా ప్రేమించాడు. 2016 జనవరి 10న పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాడు. ముస్రత్ జాన్ పామిడిలో వైద్యశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వివాహ సమయంలో రూ.2.5లక్షల నగదు, బంగారు చైను, ఉంగరం కట్నం కింద భర్త ఇస్మాయిల్ బాషా, అత్త పర్వీన్‌బాను, ఆడబిడ్డ ఫరీదా బాను అడిగారు. అయితే ముస్రత్ జాన్ తల్లిదండ్రులు తాము ఇప్పుడు ఇవ్వలేమని చెప్పారు. పెళ్లి తర్వాత ఇవ్వండని మెట్టినింటి వారు చెప్పారు. ఆ తర్వాత నుంచి తామడిగిన కట్నం తేవాలంటూ ముస్రత్‌జాన్‌కు వేధించడం మొదలుపెట్టారు. వేధింపులు భరించలేక ముస్రత్‌జాన్ మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ టి.వెంకటేశ్వర్లు సాక్షులను విచారణ చేసి.. ముద్దాయిలను అరెస్ట్ చేసి , రిమాండ్‌కు పంపి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో మొబైల్ జడ్జి జె.సుజిన్ సాక్షులను విచారించి ముద్దాయి అయిన భర్త ఇస్మాయిల్ బాషాకు ఏడాది జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. అత్త పర్వీన్ బాను, ఆడపడచు ఫరీదాబానుపై కేసు రుజువు కాకపోవడంతో వారిని నిర్దోషులుగా ప్రకటించారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టిన కోర్టు హెడ్‌కానిస్టేబుల్ కె.లక్ష్మీనారాయణ, ఏపీపీ వి.శ్రీనివాసులు కృషిని ఎస్పీ జగదీష్ అభినందించారు.

**డ్రైవర్‌కు ఏడాది జైలు**

**రాప్తాడు:** రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారకులైన డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష పడింది. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ శ్రీహర్ష మీడియాకు వెల్లడించారు. మరూరు గ్రామానికి చెందిన మూగి నరసింహులు 2017లో గ్రామం వద్ద 44వ జాతీయ రహదారి దాటుతుండగా బొలెరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మూగి నరసింహులు మృతి చెందాడు. అప్పటి సీఐ ధరణిబాబు కేసు దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం మూగి నరసింహులు మృతికి కారకులైన బొలెరో డ్రైవర్ ఈడిగ గోపాలకృష్ణకు ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ అనంతపురం స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి సృజన్ కుమార్ శుక్రవారం తీర్పు వెలువరించారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాసులు వాదించారు.

## 31న పింఛన్ పంపిణీ

**అనంతపురం క్రైం:** ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్‌ను ఈ నెల 31వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని 2,83,459 మంది పింఛన్‌దారులకు రూ.124.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. ఈ నెల 31 నుంచి జనవరి రెండో తేదీ వరకు పింఛన్‌ను పంపిణీ కొనసాగుతుందని వెల్లడించారు. లబ్ధిదారులు సచివాలయాలు, ఇతర ప్రైవేటు స్థలాలు, కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సచివాలయం సిబ్బంది ఉదయం 6 గంటల నుంచి మీ ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్ పంపిణీ చేస్తారని తెలిపారు. మొదటి రోజే వంద శాతం పింఛన్ పంపిణీ చేసేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

## 'అప్పులు తీసుకుని ఎగ్గొట్టారు'

**అనంతపురం:** కిరాణా కొట్టు నిర్వాహకులు తమ నుంచి అప్పులు తీసుకుని.. చెల్లించాలని అడిగితే ఐపీ నోటీసులు ఇచ్చారని కళ్యాణదుర్గం మండలం బాల వెంకటరాపురం గ్రామానికి చెందిన బాధితులు శుక్రవారం ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. కిరాణా కొట్టు నిర్వహిస్తున్న వలి సోదరులు గ్రామంలో ఒకరికి తెలియకుండా ఒకరితో అలా 123 మంది నుంచి రూ.5 కోట్ల దాకా అప్పులు తీసుకున్నారని పేర్కొన్నారు. అప్పులు తీర్చకుండా కాలయాపన చేస్తూ చివరకు ఎగ్గొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులో ఉన్న డిపాజిట్లు, బంగారు అంతా తీసేసుకున్న తర్వాత తమకు ఐపీ (ఇన్‌సాల్వెన్సీ పిటిషన్) నోటీసులు అందజేశారని విలపించారు. ఎన్నో కష్టాలుపడి, పైసాపైసా కూడబెట్టిన సొమ్మును నమ్మకంగా ఉన్నారని అప్పుగా ఇస్తే ఇలా చట్టంలో ఉన్న లొసుగులను చుట్టంగా మార్చుకుని తమను నట్టేట ముంచారని విలపించారు. తమకు న్యాయం చేయాలని ఎస్పీని వేడుకున్నారు.

## అధ్వానంగా ఉద్యానం



ఫ్రూట్‌బౌల్ ఆఫ్ ఏపీగా... ఉద్యానహబ్‌గా పేరున్న అనంతపురం జిల్లాలో రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా 3 లక్షల ఎకరాల్లో 72 రకాల ఉద్యాన తోటలు విస్తరించాయి. ఏటా 38 లక్షల మెట్రిక్ టన్నుల ఫలసాయం వస్తోంది. అలాంటి ఉద్యానశాఖకు ఇప్పటి వరకు పైసా కూడా బడ్జెట్ ఇవ్వలేదు. ఆయిల్‌ఫాం, బాంబూమిషన్, ఆర్‌కేవీవై, ఎంఐడీహెచ్ కింద ఉత్తుత్తి పథకాలు, కార్యక్రమాలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ ఏడాది పెనుగాలులు, అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు కూడా పరిహారం ఇవ్వకుండా దాటేశారు. తెగుళ్లు, పురుగుల దాడి, పెట్టుబడులు పెరిగి ఇబ్బంది పడుతున్నా కనీసం మార్కెటింగ్ సదుపాయం, గిట్టుబాటు కల్పించే చర్యలు కూడా చేపట్టలేదు. దీంతో ఈ ఏడాది మిరప, ద్రాక్ష, దానిమ్మ, మామిడి, చీనీ, టమాట రైతులు నష్టాలు మూటగట్టుకున్నారు.

- పట్టుపరిశ్రమశాఖకు కూడా ఈ ఏడాది బడ్జెట్, పథకాలు ఇవ్వకపోవడంతో మల్బరీ రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రోత్సాహం లేక మల్బరీ విస్తీర్ణం మందగించింది. అలాగే షెడ్లు నిర్మించుకోలేకపోతున్నారు. చంద్రబాబు సర్కారు ప్రోత్సాహం లేక 80 లక్షల చేపపిల్లలు పెంచాల్సిన మత్స్యశాఖ ఈ సారి కేవలం 20 లక్షల చేపపిల్లలకే పరిమితమైంది. దీని వల్ల మత్స్యకార కుటుంబాల ఉపాధికి భారీగా గండిపడింది.

'వ్యవసాయం దండగమారి, ఉచిత విద్యుత్ బట్టలు ఆరేసుకునేందుకు తప్ప ఎందుకూ పనికిరాదు, చచ్చిన రైతు కుటుంబాలకు పరిహారం ఇస్తూ పోతే దాని కోసమైనా ఆత్మహత్యలు చేసుకుంటారు'... గతంలో నారా చంద్రబాబు నాయుడు రైతులను హేళన చేస్తూ చేసిన వ్యాఖ్యలివి. ఇదే పంథాను ప్రస్తుతమూ కొనసాగిస్తూ సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ అన్నదాతను అన్నింటా చాలా చిన్నచూపు చూస్తోంది.



# మారిన పాలన.. రైతుకు వేదన

- ఉత్తుత్తి హామీలు, కేటాయింపులతో అన్నదాతను దగా చేస్తున్న కూటమి సర్కారు
- ప్రకృతి కరుణ, సర్కారు నుంచి ఎలాంటి సాయం లేకుండానే ముగుస్తున్న 2024
- మద్దతు ధరలు లేవు, అరకొరగా డ్రిప్, విత్తనాలు
- పడకేసిన ప్రధాన ప్రత్యామ్నాయం
- ఉద్యానం అధ్వానం, రైతుకు సాయం నిల్
- గత ఐదేళ్లూ వైఎస్ జగన్ పాలనలో అన్నదాతకు అడుగడుగునా సాయం




**అనంతపురం అగ్రికల్చర్:** రైతుల బలహీనతను ఆసరాగా చేసుకుని ఆచరణ సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు... గత ఆరు నెలలుగా వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. దీంతో 2024 సంవత్సరం రైతులకు ఓ పీడకలగా మిగిలిపోతోంది. ఒక్కటంటే ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడంతో తాము దారుణంగా మోసపోయినట్లు రైతులు గుర్తించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందించాలనే సమున్నత ఆశయంతో దేశంలోనే కాదు ప్రపంచంలో కూడా ఎక్కడా లేని విధంగా గ్రామ గ్రామాన 451 రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే) ఏర్పాటు చేసి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఇపుడు వాటిని రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కే)గా మార్పు చేసినా... వాటి ద్వారా సేవలను అందిస్తే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే మంచి పేరు వస్తుందనే దురాలోచనతో సీఎం చంద్రబాబు దాదాపు ఈ వ్యవస్థనే నిర్వీర్యం చేశారు.

### కరువు మండలాలకు కొర్రీ

ఈ ఖరీఫ్‌లో చంద్రబాబు ప్రభుత్వం కరువు మండలాలకు కొర్రీ వేయడంతో జిల్లా రైతులకు తీరని అన్యాయం జరిగింది. సాధారణం కన్నా అధికంగా వర్షాలు కురిసినట్లు చూపించి కేవలం ఏడు మండలాలను మాత్రమే కరువు జాబితాలో ప్రకటించి రూ.19 కోట్ల నామమాత్రపు ఇన్‌పుట్‌సబ్సిడీకి ప్రతిపాదనలు పంపారు. వర్షాలు, పంట దిగుబడుల పరిస్థితి జిల్లా అంతటా దాదాపు ఒకేలా ఉన్నా 7 మండలాలను మాత్రమే జాబితాలో చేర్చి మిగిలిన 24 మండలాల రైతులకు సాయం లేకుండా చేశారు.

### పడకేసిన ప్రధాన ప్రత్యామ్నాయం:

ఈ ఏడాది పాడి, పశుసంవర్ధకశాఖకు ఎలాంటి బడ్జెట్, పథక నిర్దేశన చేయకపోవడంతో ప్రధాన ప్రత్యామ్నాయం పడకేసింది. దీంతో పాడి రైతులు, జీవాల కాపర్లకు ఎలాంటి సాయం అందలేదు. కనీసం పశువైద్యానికి మందులు కూడా ఇప్పటిదాకా సరఫరా చేయడం లేదు. కేవలం 20 చాఫ్‌కట్టర్స్ (గడ్డి కత్తిరించే పరికరాలు) ఇవ్వగా అవి తమ్ముళ్లకు కూడా చాలలేదు. పశుదాణా లేదు, టీఎంఆర్ (దాణామృతం) లేదు, గడ్డి విత్తనాలు కూడా లేవు. పశుశాఖ, డ్వామా పరిధిలో పశువుల షెడ్లు పూర్తిగా పసుపుబిళ్ల కలిగిన వారికే ఇచ్చేశారు.

- గత ఐదేళ్లలో అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారం వ్యాక్సినేషన్ల ప్రక్రియ చేపట్టింది. ఏటా 150 నుంచి 200 వరకు చాఫ్‌కట్టర్స్, టీఎంఆర్ గడ్డి, 100 నుంచి 150 టన్నుల వరకు గడ్డి విత్తనాలు (ఫాడర్ సీడ్) రాయితీతో అందించింది. పశువైద్యానికి ఏటా రూ.కోట్లు విలువ చేసే అత్యవసర మందులు, వైద్య సామగ్రి అందజేసింది. దేశంలో తొలిసారిగా 1962 హెల్ప్‌లైన్ ద్వారా నియోజక వర్గానికి రెండు చొప్పున మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌లు ఏర్పాటు చేసి మారుమూల ప్రాంతాలకు సైతం నాణ్యమైన పశువైద్యాన్ని చేరువ చేశారు. అలాగే వైఎస్సార్ పశునష్ట పరిహారం పథకం అమలు చేసి చనిపోయిన పశువులు, జీవాలకు సంబంధించి రైతులు, కాపర్లపై ఎలాంటి ప్రీమియం భారం పడకుండా జిల్లాలో రూ.5 కోట్ల వరకు ఉచితంగా బీమా పరిహారం అందజేశారు. పాడి రైతులకు గిట్టుబాటు ధరలు దక్కేలా అంతర్జాతీయ స్థాయిలో పేరున్న 'అమూల్' ద్వారా పాడి సేకరణ చేపట్టారు.

### ఊసే లేని సున్నావడ్డీ

బ్యాంకుల్లో ఖరీఫ్, రబీ కింద రూ. లక్ష లోపు పంట రుణాలు తీసుకున్న రైతులకు గత వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.72 కోట్ల వరకు వడ్డీ మాఫీ చేయడంతో 3.40 లక్షల మంది సన్న చిన్నకారు రైతులకు వెసులుబాటు లభించింది. చంద్రబాబు ప్రభుత్వం వడ్డీరాయితీపై నోరు మెదిపేపరిస్థితి కనిపించడం లేదు.

### అరకొర విత్తనాలు



కరువు పరిస్థితులు నెలకొన్నా ఈ రబీలో కేవలం 25 శాతం సబ్సిడీతో పప్పుశనగ అందించడంతో జిల్లా రైతులకు రూ.6 కోట్ల వరకు అదనపు భారం పడింది. ఖరీఫ్‌లోనూ వేరుశనగ, ఇతర విత్తనాలు కూడా నామమాత్రంగా పంపిణీ చేశారు. 80 శాతం రాయితీతో 27 వేల క్వింటాళ్ల ప్రత్యామ్నాయ విత్తనాలు ఇస్తామని చెప్పి కేవలం 10 వేల క్వింటాళ్లతో ముగించారు. ఖరీఫ్‌లో కూడా 27 వేల క్వింటాళ్లకు గానూ 20 వేల క్వింటాళ్లు వేరుశనగ అందించి చేతులు దులుపుకున్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వం 40 శాతం రాయితీతో విత్తనం అందించింది. అలాగే అడిగిన ప్రతి రైతుకూ డ్రిప్, స్ప్రింక్లర్లు అందిస్తామని ఘనంగా చెప్పిన కూటమి సర్కారు జిల్లాకు 41,200 హెక్టార్లకు ఇస్తామని ప్రకటించి ఈ ఆరు నెలల కాలంలో కేవలం 4 వేల హెక్టార్లకు మాత్రమే మంజూరు చేసింది. ఉద్యానశాఖకు భారీ బడ్జెట్ కేటాయించినట్లు చెబుతున్నా ఆచరణలో కనిపించడం లేదు. పాడి రైతులకు అండగా ఉన్న అమూల్ పాలసేకరణ కార్యక్రమాన్ని బలవంతంగా మూతబడేలా చేశారు. పట్టు పరిశ్రమ శాఖ, పశుసంవర్ధకశాఖ పరిధిలోనూ ఎలాంటి పథకాలు లేక ప్రత్యామ్నాయ వ్యవసాయం కూడా చిన్నబోయింది.

### ఏదీ సుఖీభవ.?

అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఓ దగాపూరిత హామీగానే మిగిలిపోయింది. 2.90 లక్షల మందికి రూ.20 వేల చొప్పున ఇస్తే ఈ పాటికి రూ.580 కోట్లు అందాలి. పోనీ పీఎం కిసాన్‌తో కలిపి రూ.14 వేల ప్రకారం చెల్లించినా రూ.400 కోట్ల పైచిలుకు ఇవ్వాల్సివుంది. పీఎం కిసాన్ కింద ఇప్పటికే రెండు విడతలు ఇచ్చినా... కూటమి సర్కార్ మాత్రం పైసా ఇవ్వకుండా సుఖీభవను కాస్త దుఃఖీభవగా మార్చేసింది.

- గత ఐదేళ్లూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏటా పీఎం కిసాన్, రైతు భరోసా కింద రూ.13,500 ప్రకారం ఏడాదికి రూ.390 కోట్లకు పైగా ఇచ్చారు. ఇలా ఐదేళ్లలో ఒక్కో రైతుకు రూ.67,500 ప్రకారం రూ.1,937 కోట్ల సాయం అందింది.

### ❒ పంటల బీమాకు మంగళం

2023 ఖరీఫ్‌కు సంబంధించి అందాల్సిన బీమా పరిహారాన్ని కూటమి సర్కార్ అటకెక్కించింది. ఉచితంగా బీమా అమలు చేయడం కుదరదంటూ రైతులపై ప్రీమియం భారం మోపారు. బీమా వర్తించాలంటే సాగు చేసిన పంటలను బట్టి ఎకరాకు రూ.400 నుంచి రూ.1,650 వరకు ప్రీమియం కట్టాల్సిందేనని నిబంధన పెట్టారు. ప్రీమియం వల్ల ఏటా జిల్లా రైతులకు రూ.100 కోట్ల మేర అదనపు భారం పడనుంది.

- గత ఐదేళ్లూ వైఎస్ జగన్ ప్రభుత్వం రైతులపై పైసా భారం మోపకుండా ఉచిత పంటల బీమా పథకాలు అమలు చేయడంతో అటు వ్యవసాయం ఇటు ఉద్యాన పంటలకు సంబంధించి జిల్లా రైతులకు రూ.1,967 కోట్ల మేర బీమా పరిహారం అందింది.

### ❒ రైతు ఆత్మహత్యలపై మెదపని నోరు

పంట పెట్టుబడులకు చేసిన అప్పులు తీర్చలేక, పిల్లల చదువులు, పెళ్లిళ్లు చేసే స్తోమత లేక ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇచ్చే అంశంపై కూటమి సర్కారు కనీసం నోరు కూడా మెదపడం లేదు. ఈ విషయంగా ఇప్పటి వరకూ పోర్టల్ ఓపెన్ చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత జిల్లా వ్యాప్తంగా 20 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. వారికి ఎక్స్‌గ్రేషియా ఇంకా ఇవ్వలేదు. ఇస్తారా? లేదా? ఇస్తే ఎంత అనేది కూడా స్పష్టత లేదు.

- గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం రైతులు ఆత్మహత్య చేసుకున్న రెండు మూడు నెలల్లోపే బాధిత కుటుంబాలకు రూ.7 లక్షల మేర పరిహారం ఇచ్చి ఆయా కుటుంబాలను ఆదుకుంది. ఇలా 280 మంది బాధిత రైతు కుటుంబాలకు రూ.17.40 కోట్ల ఎక్స్‌గ్రేషియా అందించింది.

### ❒ 'ఇన్‌పుట్' మోసం

పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్‌సబ్సిడీ) ఇస్తారని ఆశించిన రైతులను సీఎం చంద్రబాబు మోసం చేశారు. 2023 రబీలో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 17 మండలాలను కరువు జాబితాలో ప్రకటించింది. ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం రూ.37 కోట్ల మేర పంట నష్టం జరిగినట్లు అంచనా వేశారు. ఈ ఏడాది ఆగస్టులో కేంద్ర బృందం పర్యటించి వెళ్లింది. కానీ రైతులకు ఇప్పటికీ ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా కూటమి సర్కార్ దాటేస్తోంది.

- గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఏ సీజన్‌లో జరిగిన పంటనష్టానికి ఆ సీజన్ ముగిసే లోపు ఇన్‌పుట్ ఇస్తూ వచ్చింది. ఇలా ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన నష్టానికి రూ.377 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందింది.

### ❒ కనిపించని మద్దతు ధర

గతి తప్పిన వర్షాలతో అతి కష్టమ్మీద 3.20 లక్షల హెక్టార్లలో సాగైన ఖరీఫ్ పంటల నుంచి ఉత్పత్తులు చేతికొచ్చాయి. చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటి వరకూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో మద్దతు ధర (ఎంఎస్‌పీ) లేక రైతులు అయినకాడికి దళారులు, వ్యాపారులకు అమ్మేసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ప్రధానంగా వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, వరి రైతులు ఇబ్బంది పడుతున్నారు.

- గత ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.350 కోట్ల విలువ చేసే వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధరతో కొనుగోలు చేసింది.

## బీజేపీ నేతపై టీడీపీ నాయకుల దాడి



బాధితుడు చక్రవర్తి

**కళ్యాణదుర్గం రూరల్:** తమ అవినీతిపై ఫిర్యాదు చేశాడన్న అక్కసుతో బీజేపీ నేతపై టీడీపీ నాయకులు పాశవికంగా దాడి చేశారు. బాధితుడు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఉదయం ప్రజా సమస్యల వేదికను స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు నిర్వహించారు. ఈ సందర్భంగా కంబదూరు మండలంలో సిమెంట్ రోడ్లు వేయకుండానే అధికారులతో టీడీపీ నాయకులు కుమ్మక్కై బిల్లులు చేసుకున్నారని ఎమ్మెల్యేకు బీజేపీ నేత చక్రవర్తి ఫిర్యాదు చేశారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఈ అంశంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కంబదూరులోని చక్రవర్తి ఇంటిపై టీడీపీ నేతలు గాజుల మారుతి, ముత్యాలు, శ్రీరాములు, చిదంబరయ్య, గంగాభవానీ మూకుమ్మడిగా విరుచుకుపడ్డారు. ఇంట్లో ఉన్న చక్రవర్తిని లాక్కొచ్చి విచక్షణారహితంగా దాడి చేశారు. ఘటనలో గాయపడిన చక్రవర్తిని కుటుంబసభ్యులు కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.



## ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టండి

**అనంతపురం అర్బన్:** రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలని సంబంధిత అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం రోడ్డు భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తితో కలసి ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడారు. మూడు నెలల్లో రెండు పెద్ద ప్రమాదాలు జరగడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ వైద్యసేవలు అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను, అధికంగా శబ్దం వచ్చేలా వాహనాలకు సైలెన్సర్లు ఏర్పాటు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాన్ని నడిపే వారికి, హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించాలన్నారు. ఐఎస్‌ఐ మార్క్ కలిగిన హెల్మెట్‌లను ధరించేవారికి ప్రతి నెలా



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

బహుమతులిచ్చి ప్రోత్సహించాలన్నారు. దెబ్బ తిన్న రహదారులకు జనవరిలోపు మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీటీసీ వీర్రాజు, డీపీఓ నాగరాజు నాయుడు, పీఆర్ ఎస్‌ఈ జహీర్ అస్లామ్, ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టండి**

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరిశ్రమల ఏర్పాటుతోనే జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. దీంతో నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. స్టాండప్ ఇండియా కింద ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎంఈజీపీ పథకం ద్వారా రుణం మంజూరైన యూనిట్లన్నీ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంఎస్ఎంఈలు 89,500 ఉంటే ఇప్పటి వరకూ 14 వేలు మాత్రమే సర్వే చేశారని, ఈ ప్రక్రియ వేగవంతం చేసి నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లాలో పరిశ్రమల పాలసీ కింద 15 యూనిటర్లకు రూ.2.39 కోట్ల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీధర్, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ మురళీమనోహర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మిస్సింగ్ కేసులో వీడుతున్న మిస్టరీ

- దాదాపు 28 రోజుల క్రితం ఇల్లాలి హత్య
- కనిపించడం లేదంటూ పోలీసుస్టేషన్‌లో భర్తే ఫిర్యాదు
- మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన పోలీసులు
- దర్యాప్తులో వెలుగు చూసిన నిజం



సురేఖ (ఫైల్)

**గుంతకల్లు:** ఇల్లాలి మిస్సింగ్ కేసులో మిస్టరీ వీడుతోంది. భర్తనే ఆమెను హతమార్చినట్లుగా నిర్ధారణ కావడంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వివరాలు... ఈ నెల 3న గుంతకల్లు మండలం దోసలుడికి గ్రామానికి చెందిన రఘురాముడు తన భార్య సురేఖ (27) కనిపించడం లేదంటూ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు... అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో రఘురాముడి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో ఆమెను హతమార్చినట్లు అంగీకరించినట్లు తెలిసిందే.

**ఈ నెల 3న మిస్సింగ్**

రఘురాముడు, సురేఖ (27) దంపతులకు ఇద్దరు పిల్లలు కాగా, రఘురాముడు ఆర్‌ఎంపీగా, సురేఖ గుంతకల్లులోని క్రెడిట్ ఆక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ బ్యాంకులో ఫీల్డ్ వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమె ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న రఘురాముడు... ఈ నెల 3న విధులకు వెళ్లిన సురేఖ కనిపించడం లేదని, సంత మార్కెట్ సమీపంలోని శివాలయం వద్ద స్కూటీని, అందులోనే తన సెల్‌ఫోన్‌ను వదిలేసి వెళ్లిపోయిందంటూ గుంతకల్లు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన సీఐ ఏపీ మస్తాన్ దర్యాప్తు వేగవంతం చేశారు.

**అనుమానం పెనుభూతమై**

దర్యాప్తులో భాగంగా భర్త రఘురాముడుని పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో వాస్తవాలు వెలుగు చూసినట్లు సమాచారం. భార్య సురేఖపై అనుమానం పెంచుకున్న రఘురాముడు ఎలాగైనా ఆమెను కడతేర్చాలని పథకం వేసినట్లు తెలిసింది. ఈ విషయంగా తన స్నేహితుడి సాయం తీసుకుని సురేఖను ఈ నెల 3న రహస్య ప్రాంతానికి పిలుచుకెళ్లి గొంతును లిమి హతమార్చినట్లుగా సమాచారం. అనంతరం మృతదేహాన్ని ప్లాస్టిక్ సంచిలో కూరి పాతకొత్తచెరువులోని చెరువులో పడేసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం పాతకొత్తచెరువు గ్రామం వద్ద ఉన్న చెరువులో గాలింపు చేపట్టి సురేఖ మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి, చేపలు పీక్కు తిన్నట్లుగా గుర్తించారు. బంధువుల సమక్షంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

## ముగిసిన ఆర్డీటీ రూరల్ హాకీ లీగ్ పోటీలు




విజేతలతో ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్ మేనేజర్ శ్రీదేవి

**అనంతపురం** అనంత క్రీడాగ్రామంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో వారం రోజులుగా సాగుతున్న రూరల్ హాకీ లీగ్ పోటీలు ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం జరిగాయి. ఇందులో అండర్–16 బాలుర విభాగంలో అనంతపురం, కొత్తచెరువు, అండర్–16 బాలికల విభాగంలో నార్పల, గడేకల్ జట్లు వరుసగా తొలి రెండు స్థానాలు దక్కించుకున్నాయి. విజేత జట్లను అభినందిస్తూ ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్ మేనేజర్ శ్రీదేవి, కోచ్‌లు చాడేశ్వర్, అనిల్ ట్రోఫీలను ప్రదానం చేశారు.

## వృద్ధుడి ఆత్మహత్య



మృతుడు బయన్న

**పెద్దపప్పూరు:** ఒంటరి జీవితాన్ని తాళలేక ఓ వృద్ధుడు ఆత్మహత్యచేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం తురకపల్లికి చెందిన చాకలి బయన్న (60) భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందింది. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు వేరు కాపురం పెట్టాడు. దీంతో తన బాగోగులు చూసుకునేవారు లేక బయన్న ఒంటరి అయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

## డిగ్రీ పరీక్షల్లో పది మంది విద్యార్థుల డీబార్

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న యూజీ పరీక్షల్లో శుక్రవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన 10 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. డీబార్ అయిన వారిలో న్యాయశాస్త్ర పరీక్షల్లో 8 మంది , డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు.

## ఆర్మీ విశ్రాంత ఉద్యోగి ఇంట్లో 74 బాటిళ్ల లిక్కర్ స్వాధీనం

**అనంతపురం:** నగరంలోని ఫెర్రర్ నగర్‌లో నివాసముంటున్న ఆర్మీ విశ్రాంత ఉద్యోగి వడ్డే శ్రీనివాసులు ఇంట్లో 74 ఆర్మీ ఫుల్‌బాటిళ్ల లిక్కర్‌ను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. బెంగళూరులోని ఆర్మీ క్యాంటీన్ నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసిన లిక్కర్ ఫుల్‌బాటిళ్లను అనంతపురంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లుగా విచారణలో వెల్లడైంది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు జయనరసింహ, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## విచారణకు డీఎంహెచ్‌ఓ హాజరు

**అనంతపురం మెడికల్:** తనపై వచ్చిన అవినీతి ఆరోపణల నేపథ్యంలో కలెక్టరేట్‌లో శుక్రవారం డీఆర్‌ఓ మలోల చేపట్టిన విచారణకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి హాజరయ్యారు. ఆమెపై మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఆర్‌ఓ మలోలా విచారణ చేపట్టారు.

## రైతులకు పామిడి మండల వాసి కుచ్చుటోపీ

**బత్తలపల్లి:** తనకు పొలం ఉందని, ఆవులు, గేదెలు అమ్మితే వాటిని కొనుగోలు చేస్తానంటూ నమ్మి బలికి రైతులకు కుచ్చుటోపీ వేసిన ఘటన బత్తలపల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా పామిడి మండలం దేవరపల్లికి చెందిన శ్రీనివాసులు బత్తలపల్లిలోని మారుతీ నగర్‌లో నివాసముంటున్నాడు. ఆయన తానో పెద్ద రైతునంటూ పరిచయం చేసుకుని ఆవులు, గేదెలు కొనుగోలు చేస్తున్నట్లు రైతులను నమ్మించారు. ఈ నేపథ్యంలో బత్తలపల్లి మండలం గుమ్మల్లకుంట గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి వద్ద రూ.5లక్షలు విలువ చేసే ఐదు ఆవులు, దంపెట్ల గ్రామానికి చెందిన శంకరయ్య వద్ద రూ.5వేలు విలువ చేసే ఆవు, తాడిమర్రి మండలం మరువపల్లి గ్రామానికి చెందిన వన్నూరురెడ్డి వద్ద రూ.70వేలు విలువ చేసే గేదె, 35 ప్యాకెట్ల సద్దలు, బత్తలపల్లికి చెందిన మటన్ వ్యాపారి నాగరాజు వద్ద నుంచి నాలుగు గొర్రెలు తీసుకుని డబ్బు పది రోజులకు ఇస్తానంటూ నమ్మబలికాడు. అనంతరం వారు పది రోజుల తర్వాత కనిపించకుండా పోయాడు. ఇంటి వద్దకు చేరుకున్న బాధితులు తాము మోసపోయినట్లు గుర్తించి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## అనంతపురం మీదుగా ఆరు రైళ్ల రద్దు

**అనంతపురం సిటీ:** జిల్లా కేంద్రం మీదుగా సంచరించే ఆరు రైళ్లను శనివారం నుంచి రద్దు చేస్తూ దక్షిణ మధ్య రైల్వే శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం మీదుగా తిరిగే నాలుగు, తాడిపత్రి, కడప మీదుగా తిరిగే రెండు రైళ్లను ఈ నెల 28 నుంచి రెండు నెలల పాటు రద్దు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కుంభమేళా పూర్తయ్యాక వీటిని తిరిగి పునరుద్ధరించనున్నట్లు సమాచారం.

- తిరుపతి నుంచి వయా పాకాల, కదిరి, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, బళ్లారి, రాయదుర్గం మీదుగా తిరుమలదేవరపల్లి వెళ్లే రైలు (57405)ను శనివారం నుంచి ఫిబ్రవరి 28 వరకు నిలిపివేశారు. ఇదే మార్గంలో తిరుమలదేవరపల్లి నుంచి తిరుపతి వెళ్లే రైలు (57406)ను ఈ నెల 29 నుంచి మార్చి 1 వరకు నిలిపివేశారు.
- గుంతకల్లు–తిరుపతి–గుంతకల్లు వయా అనంతపురం, ధర్మవరం, కదిరి, పాకాల మీదుగా నడిచే (57404/57403) రైళ్లను ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 28 వరకు రద్దు చేశారు.
- తిరుపతి–హుబ్లీ–తిరుపతి వయా తాడిపత్రి, కడప, రాజంపేట మీదుగా తిరిగే (57401/57402) రైళ్లను ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 28 వరకు రద్దు చేశారు.

# దగా చేయడం బాబుకు అలవాటే


అనంతపురంలో ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



ర్యాలీలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు వాసంతి, కోగటం విజయభాస్కర్ రెడ్డి, తదితరులు

- కరెంటు చార్జీల బాదుడుతో ప్రజలపై రూ.15వేల కోట్ల భారం
- చార్జీలు తగ్గించకపోతే ఉద్యమం మరింత ఉధృతం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం కార్పొరేషన్:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను దగా చేయడం చంద్రబాబుకు అలవాటేనని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి మండిపడ్డారు. మాట తప్పి.. పెంచిన కరెంటు చార్జీలను తక్షణం ఉపసంహరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు అనంతపురంలో విద్యుత్ పోరుబాట నిర్వహించారు. తొలుత పాతూరు వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వద్ద నిరసన ర్యాలీని జిల్లా అధ్యక్షుడు అనంత ప్రారంభించారు. అక్కడి నుంచి గాంధీ బజార్, వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లే మార్గాన పవర్ ఆఫీస్ వరకు ర్యాలీ సాగింది. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీ శ్రేణులు ప్లకార్డులను ప్రదర్శించి, నిరసన తెలియజేశారు. అనంతరం ఎస్‌ఈ సంపత్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ హామీల అమలులో ఘోరంగా విఫలమైందన్నారు. కరెంటు చార్జీలు పెంచబోమని.. గత ప్రభుత్వం పెంచిన చార్జీలను సైతం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పిన చంద్రబాబు ఆచరణలో మాట తప్పారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి, చేయూత, సున్నావడ్డీ, విద్యా దీవెన, వసతి దీవెన, తదితర హామీల అమలుతో పాటు డ్వాక్రా రుణాలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. జగనన్న ఇచ్చిన ప్రతి హామీనీ అమలు పర్చారని, ఇవాళ సీఎం చంద్రబాబు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. కూటమి సర్కారు రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల పింఛన్ల కోతకు కుట్ర పన్నిందన్నారు.

**మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ బాబు**

అబద్ధాలు, మోసాలకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. మాట నిలబెట్టుకోకపోతే రాజకీయంగా ప్రజలు అంతం చేస్తారని హితవు పలికారు. సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులు ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలను నష్టపరిచే విధంగా విద్యుత్ చార్జీలను పెంచిందన్నారు. పెంచిన చార్జీలను తగ్గించకపోతే ఉద్యమిస్తామన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మోసాలను తిప్పికొట్టేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధమైందన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత చోటు చేసుకుంటోందన్నారు. పార్టీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆర్థిక స్థితిగతులపై ప్రభావం చూపేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విద్యుత్ చార్జీల బాదుడుతో రూ.15వేల కోట్లకుపైగా భారం ప్రజలపై మోపడం దారుణమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్ర, ఓబిరెడ్డి, శ్రీదేవి, అమర్‌నాథ్‌రెడ్డి, ఉమాపతి, చంద్రశేఖర్ యాదవ్, సైపుల్లాబేగ్, నరసింహులు, బాకే హబీబుల్లా, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, మహిళా విభాగం నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, లక్ష్మి, దేవి, నాయకులు అనంత చంద్రారెడ్డి, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, కృష్ణమూర్తి, మీసాల రంగన్న, పెన్నోబులేసు, గౌస్‌బేగ్, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, ఖాజా, ఫయాజ్, సాకే కుళ్లాయస్వామి, అన్సర్, ఆసిఫ్, మాల్యవంతం మంజుల, పామిడి వీరాంజనేయులు, పార్వతి, శోభారాణి, శోభాబాయి, భారతి, అంకిరెడ్డి ప్రమీల, సుజాతరెడ్డి, సుహాసిని, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ప్రధానికి నివాళి

పాతూరు వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం సర్కిల్‌లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నివాళులర్పించారు. ఆయన ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ ఉన్నత విద్యలో భారతదేశం అగ్రగామిగా ఉందంటే అది ఆనాడు మన్మోహన్‌సింగ్ తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. క్రమశిక్షణ, బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ప్రధాని అని కొనియాడారు.


మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

# కరెంటు బాదుడుపై ధర్మాగ్రహం


పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి


విద్యుత్ చార్జీలు తగ్గించాలని ట్రాన్స్‌కో ఏఈకి వినతి పత్రం ఇస్తున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- రాప్తాడులో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- కరెంటు చార్జీలు తగ్గించాలంటూ హోరెత్తిన నినాదాలు
- స్వచ్ఛందంగా పాల్గొన్న వివిధ వర్గాల నేతలు, ప్రజలు
- విద్యుత్ చార్జీలను తగ్గించాలని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి డిమాండ్
- పాలన చేతకాకపోతే దిగిపోవాలని బాబుకు సూచన

**రాప్తాడు:** కరెంటు చార్జీలతో ప్రజల నడ్డి విరుస్తున్న కూటమి సర్కారుపై వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు నిప్పులు చెరిగారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాప్తాడులో కదం తొక్కారు. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా శుక్రవారం విద్యుత్ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్థానిక వైఎస్సార్ సర్కిల్లో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీతో విద్యుత్ కార్యాలయం వరకూ చేరుకున్నారు. అనంతరం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని ట్రాన్స్‌కో ఏఈ శివప్రసాద్ నాయుడుకు తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అందజేశారు.

**నినాదాల హోరు**

ర్యాలీలో సీఎం చంద్రబాబు డౌన్ డౌన్, చంద్రబాబు ష్యూరిటీ–బాదుడు గ్యారెంటీ, ఇది చంద్రబాబు పాలన కాదు చంద్ర దండు పాలన, పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలి, జై జగన్...జైజై జగన్, జై ప్రకాష్ రెడ్డి..జై ప్రకాష్ రెడ్డి అంటూ నినాదాలు హోరెత్తాయి. ఒక్క పక్క వర్షం కురుస్తున్నా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఏమాత్రం తగ్గకుండా వెనక్కు తగ్గలేదు. వర్షంలో తడుస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

**ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయ్**

అలవిగాని హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఆ తర్వాత అన్ని వర్గాలను మోసం చేశారని, అందువల్లే ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్ సీపీ రాప్తాడు సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వ అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. పాలన చేతగాకపోతే దిగిపోవాలని చంద్రబాబుకు హితవు పలికారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని ప్రకటించిన చంద్రబాబు కరెంటు చార్జీలు పెంచి రూ.15 వేల కోట్ల మేర భారాన్ని మోపి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.6 వేల కోట్లు, సర్ చార్జీల పేరుతో మరో రూ.9 వేల కోట్లు ప్రజలపై పన్ను భారం మోపుతున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడకుండా చర్యలు తీసుకున్నారన్నారు. జగన్ విద్యుత్ సంస్థను కాపాడుకుంటూ వస్తూ అప్పుల్లో ఉన్న డిస్కంలను బలోపేతం చేసేందుకు రూ.68 వేల కోట్ల డబ్బులు ఇచ్చారన్నారు. జగన్ వచ్చిన తర్వాత కరెంట్ కొనుగోలు ధరలు తగ్గించారని, గత టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్‌ను వ్యాపారం చేసిన చంద్రబాబు..లాభాపేక్షతో యూనిట్ విద్యుత్‌ను రూ.6 కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలపై కరెంట్ చార్జీల పేరుతో బాదుడు కార్యక్రమానికి తెర లేపిందన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన హామీ హామీలన్నీ తూచా తప్పకుండా అమలు చేశారని గుర్తు చేశారు. కానీ జగనన్న పప్పు అన్నం పెడితే చంద్రబాబు బిరియాని పెడతారని తెలుగుదేశం పార్టీ శ్రేణులు చెప్పిన అబద్ధాలు నమ్మి ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేశారన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలకు ప్రజలు మోసపోయారని, ఇప్పుడు మాత్రం బాబు అసెంబ్లీలో ఇచ్చిన హామీలు చూస్తుంటే భయం వేస్తోందని కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. అందువల్లే ఈ ప్రభుత్వంపై అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ప్రస్తుతం ఈ నిరసన కార్యక్రమానికి తరలివచ్చిన రైతులు, ప్రజలను చూస్తే ఇది తెలుస్తుందన్నారు.

**నియోజకవర్గంలో పరిటాల ట్యాక్స్**

నియోజకవర్గంలో ప్రతి దానికీ పరిటాల ట్యాక్స్ చెల్లించాల్సి వస్తోందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. ఒక కేజీ టమాట మీద శ్రీరామ్‌కు రూపాయి ట్యాక్స్ కట్టాలని, బ్రాంది షాపులకు వాళ్ల వాళ్లే టెండర్లు వేసుకున్నా.. వారి వద్ద నుంచి కూడా ప్రతి సీసాకు రూ.10 వసూలు చేస్తున్నారన్నారు. ఈ మధ్యనే రూ.66 లక్షలు విలువ చేసే గోవా మద్యం కూడా దొరికిందన్నారు. నియోజకవర్గంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. ప్రశ్నించిన సోషల్ మీడియా కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. అందువల్లే అరాచక పాలనకు చమరగీతం పాడేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు చంద్రకుమార్, గోవిందరెడ్డి, నాగార్జున, ఎంపీపీలు హేమలత, అంజలి, వరలక్ష్మి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్లు జూటూర్ శేఖర్, అమర్‌నాథ్ రెడ్డి, కక్రా హనుమంతరెడ్డి, బండి పవన్ కుమార్, రామాంజనేయులు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్ రెడ్డి, నాయకులు సానే రాజారెడ్డి, నిరుగంటి నారాయణరెడ్డి, బాల పోతన్న, విజయ్‌కుమార్ నాయక్, చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అధైర్యపడొద్దు .. అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ నాయకుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


యల్లప్ప ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**ఆత్మకూరు:** అధైర్య పడొద్దు...అండగా ఉంటామని వేపచెర్ల మాజీ సర్పంచ్ బిల్లే యల్లప్పకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న బిల్లే యల్లప్ప అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శుక్రవారం నేరుగా ఆస్పత్రికి వెళ్లి యల్లప్పను పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

### డాక్టర్ హేమలతకు జాతీయస్థాయి అవార్డు


అవార్డు అందుకుంటున్న హేమలత

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఇన్‌చార్జ్ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలతకు జాతీయ స్థాయి అవార్డును ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోకన్ అందించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఐఎంఏ నాటకాన్ 2024 ఉత్సవ్ కార్యక్రమం జరిగింది. ఐఎంఏ తరఫున సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉత్తమ సేవలందించినందుకు ఈమెను అవార్డుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ జాతీయ నాయకులు డాక్టర్ కేతన్ దేశాయ్, డాక్టర్ భానుశాలి, డాక్టర్ సర్బారి దత్త, ఏపీ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్, కార్యదర్శి డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ శ్రీనివాసరాజు, డాక్టర్ రవికృష్ణ పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**అనంతపురం సెంట్రల్:** ఎన్‌జీవో అసోసియేషన్ ఇరిగేషన్ సర్కిల్ యూనిట్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఈ విశ్వనాథరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనిట్ అధ్యక్షుడు రామకృష్ణ, నగర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నాయకులు రాజేష్, రాజశేఖర్, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దర్భశయనం రచనలు రైతు జీవితానికి సజీవ దర్పణాలు


'మట్టి మట్టి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

**అనంతపురం కల్చరల్:** దర్భశయనం రచనలు రైతు జీవితానికి సజీవ దర్పణం పడతాయని సాహితీవేత్తలు పేర్కొన్నారు. స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో సీనియర్ కవి దర్భశయనం శ్రీనివాసాచార్య రచించిన 'మట్టి మట్టి' కవితా సంపుటి పుస్తకావిష్కరణ శుక్రవారం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ సెమినార్ హాలులో జరిగింది. డాక్టర్ అంకె శ్రీనివాస్ అధ్యక్షతన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు డాక్టర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, బండి నారాయణస్వామి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రైతుల జీవన చిత్రాన్ని, దీన స్థితిని తెలియజేశారు. ప్రభుత్వాల తీరు వల్ల రైతుల పరిస్థితి నానాటికీ దిగజారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దర్భశయనం రచనా శైలి అద్భుతంగా సాగుతుందని, ఆయన రాసిన ప్రతి అక్షరం అనంత కరువు, దుర్భిక్ష పరిస్థితులకు సరిపోలుతుందని అన్నారు. 'మట్టి మట్టి' పుస్తకం కేంద్రసాహిత్య అవార్డుకు, జ్ఞానపీఠ పురస్కారానికి ఎంపిక కాదగిన గ్రంథమని, ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. పుస్తక సమీక్ష చేసిన రాజారామ్, నిర్వాహకుడు చం.శాస్త్రి, ఆర్ట్స్ కాలేజ్ తరఫున శ్రీరాములు నాయక్ తదితరులు వ్యవసాయ జీవితాన్ని ఆవిష్కరించిన పుస్తక ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ నేపథ్యంలో నిర్వహించిన కవితా పోటీల విజేతలకు ఆత్మీయ అతిథుల చేతుల మీదుగా బహుమతులనందించారు. కార్యక్రమంలో సీనియర్ సాహితీవేత్తలు డాక్టర్ శాంతినారాయణ, మానవతా తరిమెల అమరనాథరెడ్డి, ఉప్పరపాటి వెంకటేశులు, ఈరన్న, రియాజుద్దీన్, యోగీశ్వరనాయుడు, అంకె మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సారోళ్లు ఎక్కడికి వెళ్లారో!


సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

**రాప్తాడు:** గ్రామ సచివాలయ ఉద్యోగులు రోజూ విధులకు హాజరై ప్రజల సమస్యలు పరిష్కరించాలి. అయితే జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని రాప్తాడు గ్రామ సచివాలయం–1లో శుక్రవారం ఇద్దరు ఉద్యోగులు మాత్రమే విధులకు హాజరయ్యారు. మిగతా ఉద్యోగులు విధులకు డుమ్మా కొట్టారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ స్వాతి, వెల్ఫేర్ అసిస్టెంట్ వేణుగోపాల్‌రెడ్డి మాత్రమే సీట్లలో కనిపించారు. మిగిలిన శాఖల సిబ్బంది ఎక్కడికి వెళ్లారో ఎవరికీ తెలియడం లేదు. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన వారు నిరాశతో వెనుదిరిగారు.

**పండమేరు వంక సాకుగా చూపి...**

పండమేరు వంక పైభాగాన జగనన్న కాలనీలో రూ.40 లక్షలతో అప్పటి ప్రభుత్వం గ్రామ సచివాలయాన్ని నిర్మించింది. ఈ ఏడాది అక్టోబర్ 22వ తేదీన పండమేరు వంక ఉధృతంగా ప్రవహించడంతో దాన్ని దాటడం ఇబ్బందిగా ఉందని రాప్తాడు గ్రామస్తులు ఎమ్మెల్యే పరిటాల సునీతకు తెలిపారు. దీంతో రాప్తాడు బస్టాండులో సమీపంలోని పాత సచివాలయంలోనే విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. అప్పటి నుంచి ఉద్యోగులంతా పాత సచివాలయంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో రెండు నెలలుగా కొత్తగా నిర్మించిన సచివాలయానికి తలుపులు వేయడంతో ఆ భవనం దెబ్బతినే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్త సచివాలయం నుంచే కార్యకలాపాలు సాగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


అయ్యవారిపల్లిలో డ్రమ్ములో నీటిని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

**రాప్తాడు:** పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరి చేరవని, తద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా మలేరియా అధికారి ఓబులు అన్నారు. శుక్రవారం మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే డ్రమ్ములు, నీటి తొట్టెలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మలేరియాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇళ్ల వద్ద మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడు వాపు వ్యాధులు వస్తాయన్నారు. అందువల్ల వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి శివకృష్ణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్ బాషా, శ్రీధర్ మూర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు 'శ్రీకృష్ణ రాయబారం' పద్యనాటక ప్రదర్శన

- ముఖ్య అతిథిగా నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

**అనంతపురం కల్చరల్:** అనంత రంగస్థలానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టిన కళా దిగ్గజం గాజుల నారాయణస్వామి స్మారకార్థం శనివారం వైఎస్సార్ వీరాభిమాని కుమ్మెత సోమిరెడ్డి నేతృత్వంలో 'శ్రీకృష్ణ రాయబారం' పద్య నాటకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నారు. నాటక అకాడమీ చైర్మన్, ప్రసిద్ధ రంగస్థల కళాకారుడు గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా రావడమే కాకుండా శ్రీకృష్ణుని పాత్రతో అలరించనున్నారు. ఈ మేరకు శుక్రవారం లలితకళాపరిషత్తు కార్యదర్శి పద్మజ, కార్యక్రమ నిర్వాహకుడు సోమిరెడ్డి నాటక వివరాలను వెల్లడించారు. శనివారం సాయంత్రం 6 గంటలకు పద్యనాటక ప్రదర్శన, రంగస్థలానికి విశేష గుర్తింపు తెస్తున్న కళాకారులకు విజిలెన్స్ డీఎస్పీ గురునాథ బాబు, గుమ్మడి గోపాలకృష్ణ చేతుల మీదుగా సన్మానాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దివంగత గాజుల నారాయణస్వామి కళాకారుడిగా, ఎల్కేపీ కార్యదర్శిగా విశేష సేవలందించారని, తొలిసారి ఐదు నంది అవార్డులను అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు


తహసీల్దార్‌కు సమస్యలు తెలియజేస్తున్న గ్రామస్తులు

**ఆత్మకూరు:** భూ సమస్యలను పరిష్కరించడానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ లక్ష్మీనాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తోపుదుర్తి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భూ సమస్యలున్న వారి నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భరోసా ఇచ్చారు.

**సమాచారం అంతంతే...**

భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నా, ఆ విషయం ప్రజలకు తెలియజేయడంపై అధికారులు శ్రద్ధ చూపడం లేదు. దీంతో రెవెన్యూ సదస్సులు జనం లేక వెలవెలబోతున్నాయి. వచ్చిన అధికారులు తూతూ మంత్రంగా సదస్సు నిర్వహించేసి వెళ్తున్నారు.

## ఆట పాటలతో బోధించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న

**రాప్తాడు:** అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న పేర్కొన్నారు. శుక్రవారం ఆమె రాప్తాడులో అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో విద్యను బోధించాలన్నారు. అదే విధంగా చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

- వామపక్ష నాయకుల డిమాండ్
- 30న అనంతపురంలో నిరసన ర్యాలీ


సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీల నాయకులు

**అనంతపురం అర్బన్:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తక్షణం బర్తరఫ్ చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ అనంతపురంలో ఈ నెల 30న సంయుక్తంగా నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. శుక్రవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో సీపీఎం, సీపీఐ, ఎస్‌యూసీఐ పార్టీల జిల్లా కార్యదర్శులు నల్లప్ప, జాఫర్, రాఘవేంద్ర, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు ఏసురత్నం మాట్లాడారు. అంబేడ్కర్ నినాదం చేయడం కంటే దేవుడిని తలిస్తే ఏడుసార్లు స్వర్గానికి వెళ్లవచ్చు అంటూ రాజ్యసభలో అమిత్‌షా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేడ్కర్ విషయంలో మోదీ ప్రభుత్వ వైఖరిని తేట తెల్లం చేస్తోందని, ఈ వ్యాఖ్యలు రాజ్యాంగంపై దాడికి నిదర్శమని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పి.నారాయణస్వామి, బాలరంగయ్య, రామాంజనేయులు, కేశవరెడ్డి, అల్లీపీరా, రమణయ్య, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

**సచివాలయాల్లో ఎస్సీల వివరాలు**

**రాప్తాడురూరల్:** అనంతపురం రూరల్ మండలం 35 గ్రామ సచివాయాల పరిధిలో ఉన్న ఎస్సీ కులాల వివరాలను సిద్ధం చేసి సచివాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించినట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ కులాల వారు జాబితాలను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 31లోగా పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓకు తెలియజేయాలని కోరారు.

**ఉపాధి అవకాశాలకు దరఖాస్తు చేసుకోండి**

**అనంతపురం కార్పొరేషన్:** నగరపాలక సంస్థ మెప్మా విభాగంలో హోం ట్రయాంగిల్ యాప్ వారు నిర్వహించే ఉపాధి అవకాశాలకు ఆసక్తి కల్గిన వారు ఈ నెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ రామలింగేశ్వర్ పిలుపునిచ్చారు. వడ్రంగులు, ప్లంబింగ్ సేవలు, విద్యుత్ తదితర సేవలందించే వారు దరఖాస్తు చేసుకుంటే సదరు కంపెనీతో సమన్వయం చేసుకుని, వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం మెప్మా కార్యాలయంలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

**జాప్ జిల్లా అధ్యక్షునిగా బండి సుబ్రహ్మణ్యంరెడ్డి**

**అనంతపురం రూరల్:** జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) జిల్లా అధ్యక్షునిగా బండి సుబ్రమణ్యంరెడ్డి (నందు టైమ్స్ భాస్కర్‌రెడ్డి)ని ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పున్నం రాజు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ యుంగంధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల

## సంక్షిప్త సమాచారం

చేశారు. నూతన జిల్లా అధ్యక్షుడు బండి సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ అందించడంతో పాటు ఇంటి స్థలాలు కేటాయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలు సాగిస్తామన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తున్న విలేకర్లపై జరుగుతున్న దాడులను అరికట్టి, వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. త్వరలోనే జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామన్నారు.

**కనుల పండువగా కల్యాణోత్సవం**

**అనంతపురం కల్చరల్:** ఏడుకొండలవాడా.. వేంకటేశ్వర.. గోవిందా ..గోవింద అంటూ మాలధారుల నామస్మరణతో నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రతిధ్వనించింది. గోవింద మాలధారుల ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తిరు కల్యాణోత్సవంలో శ్రీవారి అభిషేకాలు, అర్చనలు, అలంకార సేవలు జరిగాయి. ప్రధాన అర్చకులు హరికిషోర్‌శర్మ బృందాలు తలంబ్రాలు, జీలకర్ర, బెల్లం సమర్పణ, మాంగళ్యధారణ తంతును శాస్త్రోక్తంగా జరిపించారు. మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం అనంతరం మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రమేష్, వెంకటనారాయణ, శ్రీనివాసులు, వేమారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు**

**అనంతపురం కల్చరల్:** నగరంలోని అశోక్‌నగర్ శ్రీరమా సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో సాగిన షష్టిపూర్తి కార్యక్రమంలో 170 మంది దంపతులతో సత్యనారాయణ వ్రతాలను చేయించారు. అంతకు ముందు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబటి ఫణిరాజ్, సాయి ట్రస్టు సభ్యులు విజయ్‌కుమార్, నారాయణ నాయక్, పద్మలత, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**'రాయలసీమ సాహిత్యం'పై రేపు సదస్సు**

**అనంతపురం కల్చరల్:** విమలా శాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి, కేంద్ర సాహిత్య అకాడమీ న్యూ ఢిల్లీ వారి సంయుక్త ఆధ్వర్యంలో 'రాయలసీమ సాహిత్యం – బహుజన జీవితం' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ కథా రచయిత డాక్టర్ శాంతి నారాయణ తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఎన్జీవో హోమ్‌లో ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో సాహితీ అభిమానులందరూ పాల్గొనాలని కోరారు.